క్లుప్తంగా

జాతీయ రహదారికి భూములిచ్చి సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

ఖమ్మంరూరల్: కోదాడ–కొరివి జాతీయ రహదారి కోసం రైతులు భూములిచ్చి సహకరించాలని ఆర్డీఓ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని కాచిరాజుగూడెం, ఎం వెంకటాయపాలెంలలో రైతులతో జరిగిన అవగాహన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. మార్కెట్ ధరకు మూడు రెట్లు అదనంగా రైతులకు పరిహారం ఇవ్వనున్నామని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి.సుమ, ఆర్ఐలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లోక్యాతండాలో ఘనంగా డూండ్ వేడుకలు



కామదహనంలో పాల్గొన్న తండావాసులు

కూసుమంచి: హోలీ వేడుకల్లో భాగంగా రెండో రోజు లోక్యాతండాలో బుధవారం డూండ్ వేడుకలు నిర్వహించారు. తెల్లవారు జామున నిర్వహించిన కామదహనంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మగ బిడ్డకు అన్నప్రాసన, నామకరణం కార్యక్రమాలు నిర్వహించి గేర్యా, తండా పెద్దలు తమ సంప్రదాయ పాటలతో తల్లి, బిడ్డలను దీవించారు.

విజయవంతం చేయండి

కామేపల్లి(కారేపల్లి): గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందని, అనంతరం ముచ్చర్ల క్రాస్ రోడ్డులో బహిరంగ సభ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ముగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, నాయకులు గోపిరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, జగన్నాథరెడ్డి, లక్ష్మయ్య, రామకృష్ణ, సాంబశివరావు, మల్లయ్య, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా మహాసభలను..

తిరుమలాయపాలెం: రేపు ఏన్కూరులో జరిగే ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్రెపాటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. యువత ఉద్యోగ, ఉపాధి రంగాలపై మహాసభలలో చర్చించి భవిష్యత్తు నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె. షబ్బీర్, మౌలానా, శ్రీను, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ కృష్ణమూర్తి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాజేశ్వరపురం సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్న యూత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, గ్రామ పెద్దలు యలమద్ది లెనిన్, జటంగి వెంకన్న, యూత్ సభ్యులు దాసరి నాగరాజు, గణేష్, శరత్, గోపి, ప్రభు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాజేశ్వరపురంలో ఇటీవల మృతి చెందిన కె.బుచ్చిరాములు కుటుంబానికి ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో రూ.3వేలు నగదు ఆర్థిక సాయమందించారు.

బాధ్యతలు స్వీకరించిన జీఆర్పీ ఎస్సై

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే స్టేషన్ జీఆర్పీ ఎస్సైగా భాస్కర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన భద్రాచలం రైల్వే ఎస్సైగా పనిచేస్తూ ఖమ్మం ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. ఇక నుంచి ఆయన ఖమ్మంకు పూర్తి స్థాయిలో ఎస్సైగా నియమిస్తూ రైల్వే ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

మహిళా శక్తి ప్రపంచానికే స్ఫూర్తి

ఖమ్మం నగరంతో పాటు మండలాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రైవేట్ సంస్థలు, బ్యాంకుల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, కుట్టు మిషన్లు అందజేయడంతో పాటు వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు కనబరిచిన మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యా సంస్థల్లో నిర్వహించిన వేడుకలలో ఆయా పాఠశాలల యాజమాన్యం వారు విద్యార్థులకు మహిళా దినోత్సవ ప్రాధాన్యతను తెలియచేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మహిళా శక్తి ప్రపంచానికే స్ఫూర్తి అని, మహిళల అభ్యున్నతి ద్వారానే కుటుంబం, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి



ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ నామా నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో.. మహిళలకు సన్మానాలు



హార్వెస్ట్‌లో బెలూన్లు ఎగరవేస్తున్న ప్రిన్సిపాల్



కేక్ కట్ చేస్తున్న గీతాంజలి పాఠశాల డైరెక్టర్ పద్మ



శ్రీచైతన్య ఒలంపియాడ్‌లో డైరెక్టర్ శ్రీవిద్యను అభినందిస్తున్న దృశ్యం



సర్వజ్ఞ పాఠశాలలో..



తిరుమలాయపాలెం: పిండిప్రోలు కళాశాలలో..



ఖమ్మంరూరల్: ప్రియదర్శిని కళాశాలలో..



ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ కావ్య చంద్‌కు స్త్రీ శక్తి అవార్డు అందజేస్తున్న పులిపాటి ప్రసాద్



నేలకొండపల్లి: బుద్ధారంలో ఆయా రాంబాయమ్మను సన్మానిస్తున్న దృశ్యం



ఖమ్మంఅర్బన్: మహిళతో పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు



ఖమ్మం కార్పొరేషన్ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో మహిళలకు సన్మానాలు ఇలా



ఖమ్మంరూరల్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మెఫీ మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకురాలు ఎన్.ప్రమీలకు అవార్డు అందిస్తున్న దృశ్యం



ఖమ్మం సహకారనగర్: ఎస్‌బీఐటీలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు, జి.కృష్ణ



కూసుమంచి: మహిళా కానిస్టేబుళ్లను సత్కరిస్తున్న సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్



ఖమ్మంగాంధీచౌక్: మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న కార్పొరేటర్ రామ్మోహన్‌రావు

కుట్టు మిషన్లు, గ్రైండర్లు పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఖమ్మంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో పలువురు మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు, మిక్సీలను బ్యాంక్ ఖమ్మం రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పార్థసారథి పంపిణీ చేశారు. బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ రాజశేఖర్, చీఫ్ మేనేజర్లు అంబయ్య, సంజయ్ చౌదరి పాల్గొన్నారు.



కుట్టుమిషన్ అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

మోదీ విధానాలను తిప్పికొట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడుతూ తిప్పికొట్టాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి పిలుపునిచ్చారు. పీఓడబ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ఈ సభలో మహిళా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శిరోమణితో పాటు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఝాన్సీ లక్ష్మి, జిల్లా నాయకురాలు బండెల లలిత, ఇస్లావత్ స్వాతి, గుడి చుట్టూ వసుమతి, షేక్ షాను, ఇమ్మడి చైతన్య, అనసూర్య, సుగుణమ్మ, తోట సరోజిని, కె లక్ష్మి, వనిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

నిరసనలు



నిరసనకారులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం కొణిజర్ల మండలానికి చెందిన రైతులు ఐడీఓసీకి వచ్చారు. కాగా, ఈ సమావేశానికి మంత్రి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్న క్రమంలో వీరిని సమావేశంలోకి అనుమతించలేదు. దీంతో ఆవరణలో నిరసన వ్యక్తం చేయగా.. రఘునాథపాలెం ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు సర్ది చెప్పి పంపించారు.

పెంచిన గ్యాస్ ధరలపై..

నేలకొండపల్లి: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడారు. మహిళ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండి పద్మ, బెల్లం లక్ష్మి, సిరికొండ ఉమామహేశ్వరీ, కోటేశ్వరీ, శ్యామిలేటి పద్మ, పుణ్యవతి, జ్యోతి, వెంకట్రావమ్మ, కే.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు వితరణ

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష ప్యాడ్లు అందించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాండురంగాచార్యులు, కృష్ణ హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జల్లెపల్లి పాఠశాలలో..



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న శ్రీబాలాజీ ఎస్టేట్స్ బాధ్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత రవి సహకారంతో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో పది, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చరణ్‌కుమార్ అనే పేరెంట్ గ్యాస్‌స్టవ్‌ను వితరణగా అందజేశారు. ఎస్‌ఓ రమాకుమారి, మాజీ రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మద్దినేని మధు, వార్డు సభ్యుడు కొమ్ము శ్రీను, ఎస్‌ఎంసీ చైర్మన్ జ్యోతి, మక్కా రవిందర్, నాళం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూజారి జీతం చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్..

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం పూజారికి ఎట్టకేలకు కొంత ఉపశమనం కలిగింది. 'సాక్షి'లో బుధవారం 'నిధులున్నా.. నెల జీతం ఏదీ?' అనే కథనం ప్రచురించిన విషయం విధితమే. స్పందించిన దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పి.నారాయణచార్యులు దేవాలయాన్ని సందర్శించారు. పూజారి కొడవటిగంటి నరసింహారావుతో చర్చించి విషయాన్ని సంబంధిత జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ముందుగా ఏడాది జీతం రూ.72 వేలను రెండు రోజుల్లోనే పూజారికి అందించాలని జిల్లా అధికారులు ఆదేశించారు.

రామారావు సేవలు శ్లాఘనీయం



రామారావుపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం దివంగత రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి రామారావు సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన 3వ వర్ధంతి సభ బుధవారం ఎస్సీ బాలుర వసతి గృహం ం(బి)లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు జీవిత కథ ఆధారంగా కోటపాటి రుక్మారావు రచించిన 'మనసున్న మారాజు.. మా సారు'అనే పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని రామారావు సతీమణి విజయలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, గిరిజన అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.కృష్ణ నాయక్, పీఆర్టీయూ స్టేట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ యలమద్ది వెంకటేశ్వర్లు, ఎస్ఆర్ఐ ఫౌండేషన్ జిల్లా సెక్రెటరీ బండి నాగేశ్వరావు హాజరై మాట్లాడారు. ఏబీసీడీఓ మందుల ఈదయ్య, ఏఎస్‌సీడీఓలు ఎ. శ్రీలత, పి.లక్ష్మీనారాయణ, టీహెచ్‌డబ్ల్యూఓ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, మాజీ జిల్లా అధ్యక్షులు పి. పూర్ణచంద్ర ప్రసాద్, ఫోరం జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.తిరుపతిరావుతో పాటు ఎం.వీరయ్య, అబ్దుల్ రావుఫ్, అబ్దుల్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టమాటా ఫెస్టివల్

ఖమ్మంరూరల్: మంగళగూడెంలో అవని ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో బుధవారం హోలీ, మహిళా దినోత్సవం సందర్భంగా టమాటా ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొనగా.. యాంకర్లు అనూష, క్రిష్, హరి పాడిన పాటలు, కేరళ కళాకారుల డ్రమ్స్ యువతను ఉర్రూతలూగించాయి. జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్,డీసీసీబీ డైరెక్టర్ శేఖర్,ఎ.రవి పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' ఆడ బిడ్డకు వరం

- మహిళా శ్రేయస్సే లక్ష్యంగా సరికొత్త పథకం
- ప్రతి మంగళవారం 57 రకాల ఉచిత పరీక్షలు
- జిల్లా ఆస్పత్రిలో 65 పడకల ప్రత్యేక మహిళా వార్డు, రేడియాలజీ హబ్
- ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఆరోగ్య మహిళ పథకాన్ని మేయర్ నీరజతో ప్రారంభింపజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకం మహిళలకు ఓ గొప్ప వరమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మహిళలకు మెరుగైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రేడియాలజీ యూనిట్, మామోగ్రామ్ కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద ప్రతీ మంగళవారం మహిళలకు 57 రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తారని, అవసరమైతే ఇతర దవాఖానాలకు రిఫర్ చేస్తారని తెలిపారు. పరీక్షల అనంతరం ఆరోగ్య మహిళ యాప్‌లో వివరాలు నమోదు చేసి ప్రతీ పేషంట్‌కు తన ఆరోగ్య పరిస్థితి, వైద్యం వివరాలతో కూడిన కేస్ షీట్ అందజేస్తారని చెప్పారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ దవాఖానాలు మారడంతో ప్రజాదరణ పెరుగుతున్నదని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ మాలతి మాట్లాడుతూ.. మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న డయాగ్నోస్టిక్స్, సూక్ష్మపోషక లోపాలు, పీసీఓఎస్, కుటుంబనియంత్రణ, రుతు సమస్యలు, లైంగిక వ్యాధులు, కేన్సర్ స్క్రీనింగ్, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ నిర్వహణ, శరీర బరువుకు సంబంధించిన పరీక్షలు చేసి 24 గంటల్లోనే రిపోర్టులు అందిస్తారని వెల్లడించారు. అవసరమైన వారిని రెఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేసినా.. అక్కడ కూడా మెరుగైన వైద్యం అందిస్తారని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓ బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు..



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్ అన్నారు. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా ధర్నా చౌక్ వద్ద వీర మహిళ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ ప్రభుత్వం మహిళల పట్ల చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా మహిళలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ తన కూతురు కవితకు తప్ప రాష్ట్రంలో ఏ మహిళకు న్యాయం చేయలేదని విమర్శించారు. పార్టీ నగర అధ్యక్షుడు తుమ్మా అప్పిరెడ్డి, సీనియర్ నాయకుడు ఆలస్యం సుధాకర్, మహిళా నాయకురాలు అరుణ, నీలమ్మ, ప్రధాన కార్యదర్శి రావుల గంగరాజు, యూత్ నాయకులు ఫాయస్ పాషా, గాజుల వరుణ్, ఎస్.వి. సత్యనారాయణ, అక్బర్ పాషా, గద్దం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ నిర్వహణకు బహిరంగ వేలం

- రూ.1.55 లక్షలకు (రోజుకు) దక్కించుకున్న పెనుగంచిప్రోలు కాంట్రాక్టర్
- నగరంలోని పెవిలియన్ మైదానంలో నిర్వహణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎప్పుడూ లేని విధంగా పెవిలియన్ మైదానంలో ఎగ్జిబిషన్‌కు బహిరంగ వేలం నిర్వహించారు. మైదానంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 61 రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహణకు బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఖమ్మం నగరానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లతో పాటు వరంగల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ జిల్లాలోని ఎన్టీఆర్, అన్నమయ్య, గుంటూరు జిల్లాల నుంచి ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. మొత్తం 10 మంది కాంట్రాక్టర్లు వేలంలో పోటీ పడ్డారు. కేఎంసీకి రోజుకు రూ.15,000 చొప్పున అద్దె నిర్ణయించి వేలం పాట ప్రారంభించగా.. కాంట్రాక్టర్ల మధ్య పోటీతో రూ.1,55,000లకు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. రోజుకు రూ.1,55,000లతోపాటు శానిటేషన్ కోసం సదరు కాంట్రాక్టర్ అదనంగా రూ.2,400 చెల్లించాల్సి ఉంది. రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ సంతోష్ వేలం పాట నిర్వహించారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

అంకమ్మ జాతరలో ప్రభల సందడి..

నేలకొండపల్లి/ ఖమ్మంఅర్బన్: నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం శ్రీ అంకమ్మ తల్లి జాతర, ఖమ్మం నగరంలోని 4వ డివిజన్‌లో గల కైకొండాయిగూడెం ప్రధాన రహదారిలోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయం జాతర మహోత్సవం బుధవారం రెండో రోజు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాత్రి గ్రామ ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మండలాల పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవార్ల మొక్కులు తీర్చుకున్నారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీటీసీ పుష్పలత, సొసైటీ చైర్మన్ శ్రీను, పెద్దలు పాల్గొన్నారు. గురువారం నుంచి జాతర సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగే ఎడ్ల బలప్రదర్శన పోటీలు, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు ను కూసుమంచి సీఐ కె.జితేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఖమ్మంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో 4,6 డివిజన్ల కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటి తదితరులు పాల్గొని పూజలు చేసి, దేవాలయ నిర్మాణానికి రూ.10 వేల వితరణ కార్పొరేటర్ కోటి అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కరరావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, సభ్యులు గాదె రాంబాబు, కాటేపల్లి రమేష్, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, యలమందల రామారావు, జనార్ధనాచారి పాల్గొన్నారు.



ఖమ్మంఅర్బన్: పూజలు చేస్తున్న కార్పొరేటర్లు,ఆలయ కమిటీ సభ్యులు